

ప్రజాశక్తి
బుధవారం 6 డిసెంబర్ 2023



జనవరి 21న కోరుకొండ సైనిక్ స్కూల్ ప్రవేశ పరీక్ష

ప్రజాశక్తి - పార్వతీపురం

విజయనగరం జిల్లాలో గల కోరుకొండ సైనిక్ స్కూల్ నందు 2024-25 విద్యా సంవత్సరానికి 6, 9వ తరగతుల్లో ప్రవేశాల కోసం జనవరి 21న ప్రవేశ పరీక్ష జరుగుతుందని కలెక్టర్ నిశాంత్‌కుమార్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రవేశ పరీక్షకు నిర్ణీత పరీక్షా ఫీజు గడువు ఈనెల 16 వరకు ఉందన్నారు. ప్రవేశ పరీక్షకు హాజరు కాగోరు అభ్యర్థులు దరఖాస్తులను ఆన్‌లైన్లో ఫీజు చెల్లించి సమర్పించుకోవచ్చునన్నారు. జనరల్/ సాధారణ, డిఫెన్సు, మాజీ సైనికులు, ఇతర వెనుకబడిన తరగతులకు చెందిన అభ్యర్థులకు రూ.650, ఎస్‌సి, ఎస్‌టిలకు రూ.500 పరీక్ష ఫీజు ఆన్‌లైన్‌లో పేమెంటు గేట్ వే ద్వారా, డెబిట్, క్రెడిట్ కార్డుల ద్వారా లేక ఇంటర్నెట్ బ్యాంకింగు ద్వారా మాత్రమే చెల్లించాలని ఆయన తెలిపారు.



పాచిపెంట : మూటగూడలో మృతి చెందిన ఆవుదూడ

- లోతట్టు ప్రాంతాలను పరిశీలించిన కలెక్టర్
- నేలకొరిగిన వరి చేలు
- రికార్డు స్థాయిలో వర్షపాతం
- అప్రమత్తమైన అధికారులు
- పాచిపెంటలో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

సాలూరు : పొలాల్లోని వరిచేను



రైతుల్లో అలజడి

ప్రజాశక్తి - సాలూరు

మిచౌంగ్ తుపాను కారణంగా పట్టణం, మండలంలో భారీ వర్షపాతం నమోదైంది. గడచిన రెండు రోజులుగా ఎడతెరిపి లేకుండా వర్షాలు పడుతున్నాయి. సోమవారం సాయంత్రం నుంచి వర్షాలు ఊపందుకున్నాయి. మంగళవారం రోజంతా వర్షం కురుస్తూనే ఉంది. ఈ నెలలో సాధారణ వర్షపాతం 1.7 మిల్లీ మీటర్లు కాగా ఇంతవరకు 14.1 మిల్లీ మీటర్లు నమోదు కావడంతో అధికారులు అప్రమత్తమయ్యారు. మంగళవారం తుపాను తీరం దాటనున్న నేపథ్యంలో మంగళ, బుధవారాల్లో అధిక వర్షాలు నమోదయ్యే అవకాశం ఉందని భావిస్తున్నారు. దీంతో కలెక్టర్ నిశాంత్ కుమార్ మంగళవారం పట్టణం, మండలంలోని శివరాంపురంలో పర్యటించారు. పట్టణంలోని తహశీల్దార్ కార్యాలయంలో రెవెన్యూ, మున్సిపల్, వ్యవసాయ, పోలీసు శాఖ అధికారులు అధికారులతో కలెక్టర్ నిశాంత్ కుమార్, ఐటిడిఎ పిఒ విష్ణుచరణ్ మంగళవారం ఉదయం సమీక్ష నిర్వహించారు. భారీ వర్షాలకు ముంపునకు గురయ్యే ప్రాంతాలు ఎక్కడ ఉన్నాయని అధికారులను అడిగి తెలుసుకున్నారు. లోతట్టు ప్రాంతం నుంచి ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశించారు. అనంతరం పట్టణంలోని ఫిలడెల్ఫియా ఆసుపత్రి ముందున్న చెరుకుపల్లిగెడ్డ కాలువను ఆయన అధికారులతో కలిసి పరిశీలించారు. భారీ వర్షాలు పడినప్పుడు చెరుకుపల్లి గెడ్డ కాలువ ద్వారా వరద నీరు ఎక్కువగా ప్రవహించి రోడ్డు పైకి వస్తుందని, తద్వారా రామాకాలనీ ముంపునకు గురవుతుందని అధికారులు తెలిపారు. దీంతో కాలువలో పూడిక తీసి వరద నీరు రోడ్డు పైకి రాకుండా చూడాలని ఆదేశించారు. లోతట్టు ప్రాంత ప్రజలకు పునరావాస కేంద్రాలు ఏర్పాటు చేయాలని సూచించారు. ఆ తర్వాత శివరాంపురం గ్రామాన్ని సందర్శించారు. అసంపూర్తిగా మిగిలిపోయిన వేగావతి నదిపై వంతెన నిర్మాణాన్ని పరిశీలించి సూచనలు చేశారు. భారీ వర్షాలు పడే అవకాశం ఉన్నందున ప్రజలెవరినీ నదిలోకి దిగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సర్పంచ్ జర్జాపు మోహన్ రావుకు సూచించారు.

నేలకొరిగిన వరి పొలాలు

మండలంలోని పెదపధం, శివరాంపురం, కూర్మరాజుపేట గ్రామాల్లో వరి కోతలు, నూర్పులు చాలా వరకు జరిగాయి. రైతుల నుంచి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా తరలింపు జరిగింది. అయితే కోతలు కోయని గ్రామాల్లో వరి పొలాలు కొంత వరకు నేలకొరినట్లు తెలుస్తోంది. దత్తివలస, జీగిరాం, నెలిపర్తి, కూర్మరాజుపేట గ్రామాల్లో అక్కడక్కడా వరి చేలు వర్షాలకు నేలకొరిగాయి. అయితే వ్యవసాయ శాఖ అధికారులు మాత్రం వరి పొలాలు ఎక్కడా నేలకొరిగిన దాఖలాల్లేవని చెబుతున్నారు. మండలంలో ఇంతవరకు రైతు భరోసా కేంద్రాల ద్వారా 314 మెట్రిక్ టన్నుల ధాన్యం తరలించినట్లు చెప్పారు. శివరాంపురం, పెదపదం, కూర్మరాజుపేట గ్రామాల్లో చాలా వరకు ధాన్యం కొనుగోలు పూర్తయిందని తెలిపారు.

ముందు జాగ్రత్త చర్యలు: కమిషనర్ జయరాం

మిచౌంగ్ తుపాన్ కారణంగా పట్టణంలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్న నేపథ్యంలో ముందు జాగ్రత్త చర్యలు తీసుకున్నట్లు కమిషనర్ టి.జయరాం చెప్పారు. ఫిలిడెల్ఫియా ఆసుపత్రి ముందున్న కాలువలో పూడిక తీత పనులు చేపట్టినట్లు తెలిపారు. ఎలాంటి అత్యవసర పరిస్థితులనైనా ఎదుర్కొనేందుకు సిబ్బందిని సిద్ధంగా ఉంచామని చెప్పారు. అవసరమైతే డబ్బివీధి మున్సిపల్ హైస్కూల్‌లో పునరావాస కేంద్రం ఏర్పాటు కు చర్యలు తీసుకున్నట్లు తెలిపారు. మున్సిపల్ కార్యాలయంలో కంట్రోల్ రూం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పట్టణంలోని అన్ని సచివాలయాల్లో సిబ్బందికి తుపాను విధులు నిర్వహణకు సిద్ధం చేశామని కమిషనర్ జయరాం తెలిపారు. అనంతరం మంగళవారం సాయంత్రం మున్సిపల్ కార్యాలయంలో వార్డు ప్లానింగ్ సెక్రటరీ, అమెనిటీస్ సెక్రటరీ, శానిటేషన్ సెక్రటరీ లతో కమిషనర్ సమీక్ష నిర్వహించారు. తుపాను కారణంగా వార్డుల్లో ఎలాంటి విపత్తులెదురైనా వెంటనే సమాచారం అందజేయాలని సూచించారు. ఆరో తేదీ వరకు సిబ్బంది ఎవరూ సెలవులు పెట్టొద్దని కోరారు. ఈ సమావేశంలో మున్సిపల్ డిఇ శ్రీరామ్మూర్తి,ఎఇ సూరి నాయుడు, శానిటేషన్ ఇన్ స్పెక్టర్ ఫకీర్ రాజు పాల్గొన్నారు.

పాచిపెంట : తుపాను కారణంగా కురుస్తున్న వర్షాలకు ప్రజలంతా అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ నిశాంత్ కుమార్ కోరారు. మండలంలోని అధికారులతో కలిసి పలు ప్రాంతాల్లో పర్యటించారు అనంతరం స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులతో సమీక్షించారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ మండలంలో ఇప్పటి వరకు పంటలు, ఇతర నష్టాలు కలగలేదని, అయినా క్షేత్రస్థాయిలో అధికారులను పరిశీలించాలని ఆదేశించామన్నారు. ఏజెన్సీ ప్రాంతంలో విస్తరంగా కురుస్తున్న వర్షం కారణంగా పెద్ద గడ్డ జలాశయంలోకి వరద నీరు వచ్చే అవకాశం ఉందని, దీంతో ముందస్తు జాగ్రత్తగా కేసలి, కోటికి పెంట, మడవలస ముంపు గ్రామాలైన నిర్వాసితులు ఇబ్బందులకు గురికాకుండా పాచిపెంట, కోడికాళ్లవలస, గరేళ్లవలసలో 4000 మందికి సరిపడా నాలుగు పునరావాస కేంద్రాలను సిద్ధం చేశామని చెప్పారు. అలాగే మత్స్యకారులు జలాశయంలోకి చేపల వేటకు వెళ్లొద్దని హెచ్చరికలు జారీ చేశామన్నారు. మండలంలో గుర్తించిన 74 చెరువుల వద్ద ఎప్పటికప్పుడు సమాచారం తెలుసుకొనేందుకు వీలుగా వాలంటీర్లను నియమించినట్లు ఆయన తెలిపారు. అంతకుముందు అమ్మవలస వద్ద ఉన్న కాజ్‌వేపై నుండి కొండవాగు ప్రవాహంతో రాకపోకలకు అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. ఆయనతో పాటు తహశీల్దార్ ఎం.రాజశేఖర్, ఎంపిడిఒ పి.లక్ష్మీకాంత్, ఎఒ కె.తిరుపతిరావు. ఎస్సై ఎస్‌కె ఫక్రుద్దీన్, సిడిపిఒ బి.అనంతలక్ష్మి తదితర మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

గుమ్మలక్ష్మీపురం : కురుపాం

తుపానుకు దెబ్బతిన్న ఇల్లు : ఆవుదూడ మృతి

పాచిపెంట : గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలకు మండలంలోని గరికిగుడ్డి పంచాయతీ కిమిడివలసకు చెందిన ఓలిక సాంబమూర్తి పెంకిటిల్లు మంగళవారం పాక్షికంగా దెబ్బతింది. అలాగే మూటగూడు గ్రామానికి చెందిన ఓలిక బుచ్చయ్యకు చెందిన ఆవు దూడ, తుమరావల్లి పంచాయతీ తాడరాయికి చెందిన కేరంగి పెంటయ్య మేక మృత్యువాతపడ్డాయి.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో తుపాను ప్రభావం కనిపించింది. దీనివల్ల ప్రజలు ఇంటి నుంచి బయటికి రాలేని పరిస్థితి. వ్యాపారులు, ఉద్యోగులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. మరోవైపు వర్షాల్లేక పూర్తిగా కరువు కోరల్లో ఉన్న రైతులు కాస్త మిగిలి ఉన్న పంటనైనా కాపాడుకోవాలని ప్రయత్నిస్తున్నారు. ఈ నేపథ్యంలోనే పడరానికి పాట్లు పడుతున్నారు. వరి, పత్తి పంటలు పూర్తిగా తడిసి ముద్దయ్యాయి.

తుపాను భయం..

పాలకొండ : తుపాను హెచ్చరికలు తీవ్రంగా ఉండడంతో రైతుల్లో భయం వెంటాడుతుంది. పాలకొండలో పెద్దగా ప్రభావంగా లేకపోయినప్పటికీ వర్షాలు కురుస్తాయని అధికారులు హెచ్చరికలు జారీ చేస్తుండడంతో రైతుల్లో గుబులు మొదలైంది. మండలంలో 17 వేల ఎకరాలు వరకు వరి సాగు జరుగుతుంది. అయితే తుపాన్ హెచ్చరికలతో పొలంలో ఉన్న పంటలను జాగ్రత్త చేస్తున్నారు. కొన్ని చోట్ల వరిని కల్లాలకు తీసుకురావడం, అవకాశం లేనిచోట్ల పొలంలోనే కుప్పలుగా పెట్టి జాగ్రత్తలు తీసుకుంటున్నారు. మండలంలో భాసూరు, విపి రాజుపేట, అంపిలి, అన్నవరం తదితర గ్రామాల్లో ఈ పనుల్లో రైతులు బిజీగా ఉన్నారు.

మిచాంగ్‌తో రైతుల్లో అలజడి

కురుపాం : మిచాంగ్ తుపాన్ ప్రభావం రైతుల్లో తీవ్ర అలజడి రేపింది. ఆరుగాలం శ్రమించడంతో పక్వానికి వచ్చిన వరి పంట నీటి పాలవుతోందన్న భయంతో పలువురు రైతులు ఆందోళన చెందుతున్నారు. ఈ ఏడాది గత మూడు నెలలుగా సకాలంలో వర్షాలు కురవకపోయినా సరే వరి పంటలను రైతులు కష్టపడి నిలబెట్టారు. కోత దశలో ఉన్న వరి పంటను రేపో మాపో సమాకుర్చుకోవాల్సిన దశలో తీవ్ర తుపాన్ రావడంతో కొంత మంది రైతులు ఆందోళనలో చెందుతున్నారు. ఈ నేపథ్యంలో ఆకస్మికంగా తుపాను ఏర్పడడంతో రైతుల్లో తీవ్ర ఆందోళన ఏర్పడింది. మండలం కొన్ని చోట్ల వరి పంట పక్వానికి రాగా మరి కొన్ని చోట్ల కోసిన పంట వర్షానికి తడిసి ముద్దవుతోంది. ఈ ఏడాది తీవ్ర వర్షాభావం వచ్చినా అధిక పెట్టుబడులతో నిలబెట్టినా పంట చేతికి అందే సమయంలో ఇలా తుపాను రావడంతో రైతులు కన్నీరు మున్నీరవుతున్నారు.

వీరఘట్టం : మండలంలోని ప్రజలను అప్రమత్తం చేయాలని తహశీల్దార్ సిహెచ్ సత్యనారాయణ విఆర్‌ఒలను ఆదేశించారు. మంగళవారం స్థానిక కార్యాలయంలో ఏర్పాటు చేసిన విఆర్‌ఒల సమావేశంలో మాట్లాడారు. తుపాను దృష్టిలో పెట్టుకొని సంబంధిత గ్రామాలు సందర్శించి ప్రజలను అప్రమత్తం చేయాలన్నారు. సమావేశంలో విఆర్వోలు పాల్గొన్నారు.

తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించిన పిఒ

మక్కువ : తుపాను ప్రభావిత ప్రాంతాల్లో ప్రత్యేక అధికారి, పార్వతీపురం ఐటిడిఎ ప్రాజెక్టు అధికారి సి విష్ణు చరణ్ పర్యటించారు. వాతావరణశాఖ హెచ్చరికల మేరకు వివిధ శాఖలు చేపట్టాల్సిన పనులను స్పష్టంగా తెలిపారు. కళ్లాల్లో ధాన్యం ఉండరాదని, సురక్షిత ప్రాంతాలకు తరలించాలని ఆదేశాలు జారీ చేశారు. ఎక్కడైనా ధాన్యం ఉంటే వ్యవసాయ సహాయకునికి సమాచారం అందించాలని కోరారు. వరద అవకాశం ఉన్న చెరువులు, వాగులు, వంకల వద్ద, ప్రమాదకర క్రాసింగ్‌ల వద్ద వాలంటీర్లను ఏర్పాటు చేసి ఎవరూ దాటకుండా చూడాలని ఆయన చెప్పారు. రవాణాకు, తాగునీటికి, విద్యుత్ కు, పునరావాస కేంద్రాలను ఏర్పాటు చేయుటకు ఎటువంటి సమస్య ఏర్పడకుండా పక్కా కార్యాచరణ ప్రణాళికలు, పరికరాలు ఉండాలని ఆయన ఆదేశించారు. లోతట్టు ప్రాంతాల్లో పర్యటించి సంబంధిత అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అధికార యంత్రాంగం సన్నాహక చర్యలు పరిశీలించారు. మండలంలో పర్యటించి అక్కడి పరిస్థితులు అంచనా వేశారు. మండల పరిషత్ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులు, సిబ్బందితో సమీక్ష జరిపారు. కార్యక్రమంలో తహశీల్దార్, ఎంపీడీఓ ఇతర అధికారులు పాల్గొన్నారు.



పాచిపెంట : కిమిడివలసలో పాక్షికంగా దెబ్బతిన్న ఇల్లు

జిల్లాలో మోస్తరు వర్షాలు

ప్రజాశక్తి - పార్వతీపురంరూరల్

తుపాను ప్రభావం వల్ల జిల్లాలో మోస్తరు వర్షాలు కురుస్తున్నాయి. దట్టంగా మబ్బులు కమ్ముకొని నెలకొనగా, సన్నటిపాటి చినుకులు అప్పుడప్పుడు కురుస్తూ ప్రజలను ఇబ్బందులకు గురి చేశాయి. బీకరమైన గాలులు వేస్తాయని ప్రకటించినప్పటికీ ఈదురు గాలులు అంతగా లేకపోవడంతో ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు. మంగళవారం ఉదయం 6 గంటల వరకు అధికారులు తెలిపిన వర్షపాత వివరాలిలా ఉన్నాయి. జిల్లాలో అధికంగా మక్కువ మండలంలో 14.0 మిల్లీ మీటర్ల వర్షం కురవగా, అత్యల్పంగా గరుగుబిల్లి మండలంలో 1.8 మిల్లీమీటీర్ల వాన పడింది. కొమరాడ 5.4, పార్వతీపురం 6.2, సీతానగరం 9.4, బలిజిపేట 6.4, సాలూరు 6.4, పాచిపెంట 7.8, కురుపాం 8.7, జియ్యమ్మవలస 6.2, గుమ్మలక్ష్మీపురం 2.8 మిల్లీ మీటర్ల వర్షపాతం నమోదైంది.

నేడు పాఠశాలలకు సెలవు

పార్వతీపురంరూరల్ : జిల్లాలో పాఠశాలలకు బుధవారం కూడా సెలవును ప్రకటించారు. ఈ మేరకు మంగళవారం జిల్లా విద్యాశాఖ అధికారి ఎన్.ప్రేమకుమార్ ఒక ప్రకటన విడుదల చేశారు. తుఫాను ప్రభావం వల్ల భారీ వర్షాలు, గాలులు వీచే అవకాశం ఉన్న దృష్ట్యా పిల్లల సురక్షిత చర్యల్లో భాగంగా సెలవు ప్రకటించేందుకు కలెక్టర్ అనుమతించారని ఆయన చెప్పారు. ఉపాధ్యాయులు, సిబ్బంది, వంట ఏజెన్సీలు అందుబాటులో ఉండాలని ఆదేశించారు.



మక్కువ : అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న పిఒ విష్ణుచరణ్



సాలూరులోని ముంపు ప్రాంతాలను పరిశీలిస్తున్న కలెక్టర్ నిశాంత్‌కుమార్

ఎన్‌ఎంఎంఎస్ పరీక్ష ప్రాథమిక కీ విడుదల

ప్రజాశక్తి - పార్వతీపురం

ఈనెల 3న జరిగిన జాతీయ ఉపకారవేతన పరీక్ష (ఎన్‌ఎంఎంఎస్) ప్రాథమిక కీ విడుదల చేసినట్లు జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.ప్రేమ కుమార్ తెలిపారు. ఈ పరీక్షకు 1413 మంది విద్యార్థులు నమోదు చేసుకోగా, వారిలో 1375 మంది(97 శాతం) పరీక్షకు హాజరైనట్టు తెలిపారు. ఇందుకు సంబంధించిన ప్రాథమిక ఈనెల 4న విడుదలైందని, కార్యాలయపు వెబ్సైట్ www.bse.ap.gov.in నందు ఉంచబడినదని, ప్రాథమిక కీ విషయంలో అభ్యంతరాలను ఈనెల 12న సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయపు వెబ్సైట్‌లో గల గ్రీవెన్స్ లింకు ద్వారా ఆన్లైన్‌లో స్వీకరించనున్నట్టు డిఇఒ పేర్కొన్నారు.

7న ఎన్నికల రోల్ అబ్జర్వర్ రాక

ప్రజాశక్తి - పార్వతీపురం

ఎన్నికల రోల్ అబ్జర్వర్, ఉన్నత విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి జె.శ్యామలరావు ఈ నెల 7న జిల్లాకు వస్తున్నారని జిల్లా కలెక్టర్ నిశాంత్ కుమార్ తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఎన్నికల రోల్ అబ్జర్వర్ ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో జిల్లా కలెక్టర్ కార్యాలయంలో మధ్యాహ్నం 12.30 గంటలకు సమావేశం నిర్వహిస్తారని ఆయన తెలిపారు. రోల్ అబ్జర్వర్ సమావేశానికి ప్రజాప్రతినిధులు, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు హాజరు కావాలని ఆయన కోరారు. సమావేశంలో భాగంగా సూచనలు, సలహాలు, ఫిర్యాదులను రోల్ అబ్జర్వర్ స్వీకరిస్తారని ఆయన చెప్పారు.



గోనె సంచులను పరిశీలిస్తున్న జాయింట్ కలెక్టర్ నిశాంత్‌కుమార్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన జెసి

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని గంగాపురం ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, తహశీల్దార్ శివన్నారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ తుపాను వాతావరణం దృష్టిలో ఉంచుకొని రైతుల దగ్గర నుంచి ఆఫ్‌లైన్‌లో తీసుకున్న ధాన్యానికి పేమెంటుకు సంబంధించిన ఇబ్బందులు రాకుండా వాటి వివరాలు ఆన్ లైన్ నందు నమోదు చేయాలని, ఇ-క్రాప్ బుకింగు చేసిన పంటను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజరు దేవుళ్ల నాయక్, వ్యవసాయ అధికారి అశోక్ పాల్గొన్నారు.

అంగన్వాడీ పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సాలూరు

ప్రాజెక్టు పరిధిలోని సాలూరు మండలం ఎగువ మెండంగి, ఎం.కొత్తవలస గ్రామాల్లో అంగన్వాడీ హెల్పర్, మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులకు దరఖాస్తు లు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ బి.సత్యవతి తెలిపారు. ఈనెల 6నుంచి 10లోగా దరఖాస్తులు ప్రాజెక్టు కార్యాలయంలో అందజేయాలని కోరారు. ఎగువమెండంగిలో హెల్పర్ పోస్ట్, ఎం.కొత్తవలసలో మినీ అంగన్వాడీ కార్యకర్త పోస్టులు భర్తీ చేయనున్నట్లు తెలిపారు. ఈ రెండు పోస్టులు ఎస్టీలకు రిజర్వ్ చేసినట్లు చెప్పారు. పదోతరగతి ఉత్తీర్ణులై, ఆ గ్రామాల కోడలైన మహిళలు అర్హులని తెలిపారు. 21 నుంచి 35ఏళ్లలోపు వయస్సు గల వారు నిర్దేశించిన ధ్రువ పత్రాలతో దరఖాస్తు చేయాలని సిడిపిఒ ఒక ప్రకటనలో కోరారు.

ఆఫ్ లైన్‌లో సేకరించిన ధాన్యం వివరాలు ఆన్ లైన్లో నమోదు

ప్రజాశక్తి - పార్వతీపురం

ఆఫ్ లైన్‌లో సేకరించిన ధాన్యం వివరాలు ఆన్ లైన్లో నమోదు చేయాలని జాయింటు కలెక్టరు ఆర్.గోవిందరావు తెలిపారు. మంగళవారం తుపాను తీవ్రత దృష్ట్యా సీతంపేట మండలంలో తుఫాను ప్రభావిత ప్రాంతాల్లో క్షేత్ర స్థాయిలో పర్యటిస్తు పరిస్థితులను తనిఖీ చేశారు. పెదంకలాం రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి తుపాను తీవ్రత దృష్ట్యా యుద్ధ ప్రాతిపదికన మిల్లులకు తరలించిన ధాన్యం వివరాలు తెలుసుకున్నారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా ఆఫ్‌లైన్‌లో ధాన్యం కొనుగోలు చేస్తామని, మండలంలో ఆఫ్‌లైన్‌లో తీసుకున్న ధాన్యానికి పేమెంటుకు సంబంధించిన ఇబ్బందులు రాకుండా వాటి వివరాలు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, ఇ-క్రాప్ బుకింగు చేసిన పంటను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. కార్యక్రమంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజరు దేవుళ్ల నాయక్, తహశీల్దారు ఆర్.వి.రమణ, వ్యవసాయ అధికారి అవినాష్ పాల్గొన్నారు.

మినీ అంగన్వాడీ కార్యకర్తల పోస్టులకు దరఖాస్తులు

ప్రజాశక్తి - సీతంపేట

మినీ అంగన్వాడీ కార్యకర్తలు పోస్టులకు ఆరో తేదీ నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సిడిపిఒ పి.రంగలక్ష్మి తెలిపారు. రాజు గాడిగూడ, గురండి, చిన్నబగ్గ, పెద్దబగ్గ, కోడిపిల్లలగూడ దరఖాస్తు ఆహ్వానిస్తున్నట్లు తెలిపారు. హెల్పర్ పోస్టు ఏడు ఖాళీ ఉన్నట్లు తెలిపారు.



పిఒకు వినతిని అందజేస్తున్న టిడిపి నాయకులు

రెండు చోట్ల ఓట్లు ఉంటే తొలగిస్తాం : పిఒ

ప్రజాశక్తి - సీతంపేట

రెండు చోట్ల ఓటు హక్కు కలిగి ఉన్న వారి ఓట్లను తొలగించేందుకు చర్యలు తీసుకొంటామని పిఒ కల్పనాకుమారి అన్నారు. మంగళవారం అన్ని రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా పిఒ మాట్లాడుతూ చనిపోయిన వారి ఓట్లను ఇప్పటికే తొలగించామని, ఇంకా ఏమైనా ఉంటే వాటిని కూడా తొలగిస్తామన్నారు. ఇంకా కొత్తగా ఎవరైనా ఓటు నమోదు చేసుకోదలచిన వారుంటే వెంటనే నమోదు చేసుకోవాలని సూచించారు. శాశ్వతంగా వలస వెళ్లిపోయిన వారి ఓట్లను కూడా విచారణ చేపట్టి తొలగిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సీతంపేట తహశీల్దార్ నరసింహమూర్తి, డీటీ కుమారి, పాలకొండ నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి జయకృష్ణ, భామిని టిడిపి మండల అధ్యక్షులు భోగాపురపు రవి నాయుడు, ఇతర నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సమస్యలపై పిఒకు వినతి

ఓటర్ల జాబితాలోని తప్పులను సవరించాలని ఐటిడిఎ పిఒ కల్పనాకుమారికి పాలకొండ నియోజకవర్గ తెలుగుదేశం ఇన్‌ఛార్జి నిమ్మక జయకృష్ణ మంగళవారం వినతిని అందజేశారు. 287 బూత్ పరిధిలోని ఫారం6, 7, శాశ్వత వలసదారులు, వలదారులు, నకిలీ ఓట్లను పరిశీలించాలన్నారు. అలాగే బూత్‌నెంబరు 287 పరిధిలోని వివిధ సమస్యలను, అభ్యంతరాలను పిఒకు వివరించారు. వినతిని అందజేసిన వారిలో పాలకొండల టిడిపి అధ్యక్షులు గండి రామినాయుడు, భామిని మండల టిడిపి అధ్యక్షులు బోగాపురపు రవినాయుడు, మాజీ ఎంపిపి భూపతి ఆనంద రావు, వీరఘట్టం మండల టిడిపి అధ్యక్షులు ఉదయాన ఉదయ్ భాస్కర్, ప్రధాన కార్యదర్శి చింత ఉమా, సర్పంచ్ శేషాపు సుగణకర్ రావు, ఆగతమూడి గోవిందరావు, ఐటిడిపి కో-ఆర్డినేటర్ హిమరక పవన్, మంకు రాము పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ విక్రాంత్

ఆస్పత్రిలో సమస్యల పరిష్కారానికి చర్యలు

ప్రజాశక్తి - పాలకొండ

స్థానికఏరియా ఆసుపత్రిలో సమస్యలు పరిష్కారానికి అన్ని విధాలగా చర్యలు తీసుకుంటానని శాసన మండలి విప్ పాలవలస విక్రాంత్ పేర్కొన్నారు. మంగళవారం స్థానిక ఏరియా ఆసుపత్రిలో అభివృద్ధి కమిటీ సమావేశానికి ముఖ్యతిధిగా విక్రాంత్ హాజరై మాట్లాడారు. రోగులకు మరింత మెరుగైన వైద్య సేవలందించాలన్నారు. ఆసుపత్రికి కావాల్సిన వసతులు సమకూర్చేందుకు తన వంతు చర్యలు తీసుకుంటానని హామీ ఇచ్చారు. ఎమ్మెల్యే, అభివృద్ధి కమిటీ చైర్మన్ కళావతి మాట్లాడుతూ రోగులకు చిత్తశుద్ధితో వైద్య సేవలందించాలన్నారు. ఇక్కడే మెరుగైన వైద్య సేవలందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇక్కడ నుంచి అవసరం లేకుండా రోగులను రిఫర్ పేరుతో తరలించొద్దని అన్నారు. సమావేశంలో ఆసుపత్రి సూపరింటెండెంట్ నాగభూషణ, కమిటీ సభ్యులు ఎచ్చెర్ల జయరాం, రెడ్డి లక్ష్మీ తదితరులున్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీసు

ప్రజాశక్తి - పాలకొండ

సమస్యల పరిష్కారం కోసం ఈనెల 14,12న కలెక్టరేట్ ఎదుట 36 గంటల ధర్నా నిర్వహణకు సంబంధించి సమ్మె నోటీసును మంగళవారం వైద్యాధికారికి ఆశా వర్కర్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆశా వర్కర్లు యూనియన్ నాయకులు మాట్లాడుతూ ఆశా వర్కర్లకు కనీస వేతనాలు చెల్లించాలన్నారు. సంబంధం లేని పనులు అప్పగిస్తున్నారన్నారు. కమ్యూనిటీ హెల్త్ వర్కర్లగా గుర్తించాలని, పని భారం తగ్గించాలని తదితర డిమాండ్లను పొందుపర్చారు. వినతిని అందించిన వారిలో గౌరీశ్వరీ, రాధారాణి, గౌతమి, ఎం.కాంతామణి, శాంతికుమారి, బి.అనూరాధా తదితరులు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న తహశీల్దార్ రమేష్‌కుమార్

అధికారులు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - కురుపాం

తుపాను ప్రభావం వల్ల మండలంలో అధికారులంతా అప్రమత్తంగా ఉండాలని తహశీల్దార్ ఆర్.రమేష్ కుమార్ అన్నారు. మంగళవారం తన కార్యాలయం వద్ద అధికారులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి పంచాయతీ, గిరిజన గ్రామాల్లో అధికారులు సందర్శిస్తూ తుపానుపై ప్రజలకు ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తూ వారికి అత్యవసరమైన సేవలు అందించడానికి సిద్ధంగా ఉండాలని అన్నారు. కార్యక్రమంలో ఎఇలు పి.నాగేశ్వరరావు, ఆర్.వేణుగోపాలరావు, ఎపిఒ పి.బావాజీ, ఎపిఎం ఇ వి కిషోర్ తదితరులు పాల్గొన్నారు.

అంగన్వాడీ సహాయకుల పోస్టులు భర్తీ

ప్రజాశక్తి - భామిని

మండలంలోని సింగిడి, సవరపాడు, చింతలగూడలో ఖాళీగా ఉన్న అంగన్వాడీ సహాయకులు పోస్టులుకు 10 వ తరగతి ఉత్తీర్ణత కలిగిన, 35 ఏళ్లలోపు వయసు కలిగిన వివాహిత స్థానిక మహిళ దరఖాస్తు చేసుకోవాలని సిడిపిఒ శాంతిభవాని తెలిపారు. రోస్టర్ ప్రకారం సింగిడి, సవరపాడు సహాయ కార్యకర్త ఓపెన్ కేటగిరీ ఉందని, చింతలగూడలో ఎస్టి కేటగిరీ వారు దరఖాస్తు చేసుకోవచ్చు అని తెలిపారు.

తాగునీటి వనరుల పరిశీలన

ప్రజాశక్తి - పాలకొండ

మండలంలోని సిరికొండలో తాగునీటి వనరులను మంగళవారం స్థానిక ఎంపిడిఒ డొంక త్రినాధరావు పరిశీలించారు. గ్రామంలో ఉన్న నేలబావిని పరిశీలించి క్లోరినేషన్ చేయాలని సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. వర్షాలు కురుస్తున్న కారణంగా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం వెలగవాడ సచివాలయాన్ని సందర్శించారు. అక్కడ రికార్డులను పరిశీలన చేసి సంతప్తిని వ్యక్తం చేశారు. ప్రజలకు సకాలంలో పనులు చేపట్టేలా చూడాలన్నారు.



జాబ్‌మేళాకు పేర్లు నమోదు చేసుకుంటున్న అభ్యర్థులు

గుమ్మలక్ష్మీపురంలో జాబ్ మేళా

ప్రజాశక్తి - గుమ్మలక్ష్మీపురం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఆవరణంలో వికాస్ సంస్థ కలెక్టరేట్ కాకినాడ ఆధ్వర్యంలో మంగళవారం ఉద్యోగమేళా నిర్వహించారు. ఈ ఉద్యోగ మేళాకు 400మంది హాజరయ్యారు. వీరిలో 141 మంది ఇంటర్వ్యూలో పాల్గొన్నగా, 72మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు కల్పించినట్లు తెలిపారు. గుమ్మలక్ష్మీపురం, కురుపాం, జియమ్మవలస, కొమరాడ, పార్వతీపురం, సీతంపేట నుంచి యువకులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

'జగన్ నీవే మా నమ్మకం'

ప్రజాశక్తి - గరుగుబిల్లి

మండలంలోని తోటపల్లిలో జగన్ నీవే మా నమ్మకం అన్న కార్యక్రమం ఎంపిపి ఉరిటి రామారావు, జెడ్‌పి వైస్‌చైర్మన్ మరిశర్ల బాపూజీనాయుడు ఆధ్వర్యాన మంగళవారం జరిగింది. అర్హులైన వారందరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్న ప్రభుత్వమన్నారు. మా నమ్మకం నువ్వే జగనన్న కార్యక్రమం ద్వారా జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన సంక్షేమ పథకాల బోర్డును ఆవిష్కరించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ జి.పైడితల్లి, ఇఒపిఆర్‌డి ఎల్.గోపాలరావు, సిబ్బంది,



సమావేశంలో మాట్లాడుతున్న జెడ్‌వైస్‌చైర్మన్

ఆరోగ్య సమస్యలు తలెత్తకుండా అప్రమత్తం

ప్రజాశక్తి - కొమరాడ

ఆరోగ్య పరమైన సమస్యలు తలెత్తకుండా సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని జిల్లా హెల్త్ ప్రోగ్రాం అధికారి డాక్టర్ టి.జగన్మోహనరావు సూచించారు. తుఫాన్ హెచ్చరిక నేపథ్యంలో ఈ మేరకు ఆయన మంగళవారం నదీ పరీవాహక ప్రాంతంలో కళ్లికోటను సందర్శించారు. ఎంపిడిఒ ఎం.మల్లికార్జునరావుతో కలిసి సిబ్బందిని అప్రమత్తం చేసి, ప్రజలకు తగు సూచనలు చేశారు. గ్రామంలో ప్రాథమికంగా అవసరమైన మందులు, పరీక్షలు, వైద్య పరికరాలు అందుబాటులో ఉంచాలని, వ్యాధులు ప్రబలకుండా ఉండేందుకు పరిసరాల్లో బ్లీచింగ్ చేయాలన్నారు. తాగునీటి ట్యాంకుల్లో క్లోరినేషన్ చేయాలన్నారు. వీటికి సంబంధించి పంచాయతీ సెక్రటరీ తగు కార్యాచరణ చేపడుతూ పర్యవేక్షణ చేయాలన్నారు. గర్భిణుల ఆరోగ్యంపై ప్రత్యేక పర్యవేక్షణ ఉంచాలని, కాన్పు సమయం దగ్గరగా ఉన్న గర్భిణులను ముందస్తుగా ఆసుపత్రిలో చేర్చాలని వైద్య సిబ్బందికి సూచించారు. సిబ్బంది సమన్వయంతో ఉండి, అప్రమత్తంగా ఉండాలన్నారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్మోహనరావు అక్కడ ప్రజలను అప్రమత్తం చేస్తూ తగు సూచనలు చేశారు. కాచి చల్లార్చిన నీటిని ప్రజలు తాగడానికి వినియోగించాలని, అవసరమైన నీరు ముందుగానే సిద్ధం చేసుకోవాలన్నారు. సాధ్యమైనంత వరకు వేడిగా ఉన్న ఆహార పదార్థాలు వినియోగించాలని, మూతలు ఉంచాలన్నారు. చిన్న పిల్లలు, వృద్ధుల పట్ల తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. మల్లికార్జున రావు మాట్లాడుతూ ముందస్తు చర్యలు చేపట్టడం జరిగిందని, ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, నదీ తీరం వైపు ఎవరూ వెళ్లరాదని సూచించారు. అనంతరం డాక్టర్ జగన్మోహనరావు అక్కడ నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాంను తనిఖీ చేసి, ప్రజలకు నిర్వహించిన ఆరోగ్య తనిఖీలు, పరీక్షలు రికార్డులో పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యాధికారి ఎం.శిరీష, ఎంఇఒ నారాయణస్వామి, సర్పంచ్ డి.మురళీకృష్ణ, పంచాయతీ సెక్రటరీ ఎన్.నరేష్, పిహెచ్ఎన్ విజయకుమారి, వైద్య, సచివాలయం సిబ్బంది,ఆశా కార్యకర్తలు, గ్రామ వాలంటీర్లు పాల్గొన్నారు.



ప్రజలకు ఆరోగ్య సూచనలు చేస్తున్న డిఐఒ జగన్మోహన్‌రావు



పలకలు తొలగించడంతో దుర్గంధం వెదజల్లుతున్న మురుగు కాలువలు

కాలువపై పలకలు తొలగింపు

ప్రజాశక్తి - పార్వతీపురం టౌన్

మిచౌంగ్ తుపాన్ దృష్ట్యా ముందస్తు చర్యల్లో భాగంగా ప్రజలు ఇబ్బంది పడకుండా ఉండాలనే ఉద్దేశంతో కమిషనర్ జె. రామ అప్పలనాయుడు ఆధ్వర్యంలో సోమవారం రాత్రి నుండి మంగళవారం ఉదయం వరకు యుద్ధ ప్రాతిపదికన జిల్లా కేంద్రంలో మున్సిపల్ పరిధిలో వరద నీరు మళ్లించేందుకు పట్టణం ప్రధాన రహదారికి ఇరువైపులా ఉన్న కాలువలపై పలు కూడళ్ల వద్ద ఉన్న పలకలను అక్కడికక్కడ తొలగించడమే కాకుండా, బెలగాం వైపు ఉన్న బిఎస్ఎన్ఎల్ కార్యాలయం నుండి ఆర్టీసీ డిపో అవుట్ గేట్ రహదారి వరకు ఉన్న ప్రధాన కాలువపై ఉన్న పలకలను పూర్తిస్థాయిలో చెత్తల, వ్యర్థాలను తొలగించేందుకు ప్రైవేట్ జెసిబిలను, ఉపయోగించి సిబ్బంది సహాయంతో తొలగింపు చర్యలు చేపట్టారు. దీంతో పాటు మున్సిపల్ పరిధిలోని గెడ్డవీధి, చైతన్య చైతన్య స్కూల్‌కు వెళ్లే ప్రాంతం, బంగారమ్మ కాలనీ మురుగు నీరు, వర్షపు నీరు ప్రవహించే గెడ్డకు సంబంధించి అడ్డంకులుగా ఉన్న మురుగు మట్టి తొలగింపు పనులు, బెలగాం గెడ్డ వీధి దగ్గర రోడ్డుకు ఇరువైపులా మురుగు నీరు పోవుటకు, రెడ్డి వీధి చివరు ప్రాంతంలో పేరుకు పోయిన చెత్త, మట్టి తొలగింపు చర్యలు, కొత్తవలస దుర్గ గుడి ఎదురుగా ఉన్న కాలువలో పేరుకుపోయిన చెత్త, మట్టిని తొలగింపు పనులు చేపట్టారు. ఈ పనుల్లో మున్సిపల్ కమిషనర్, శానిటేషన్ ఇన్‌స్పెక్టర్ సిహెచ్.మురళి, సచివాలయాల శానిటరీ సెక్రటరీలు, ప్రజారోగ్య విభాగం సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



పేదలకు అన్నదానం చేస్తున్న రెడ్‌క్రాస్ చైర్మన్ మంచుపల్లి శ్రీరాములు

సామాజిక కార్యకర్తలకు సన్మానం

ప్రజాశక్తి - బెలగాం

అంతర్జాతీయ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం సందర్భంగా పట్టణంలోని నిరాశ్రయుల వసతి గృహంలో వివిధ సామాజిక కార్యక్రమాలు చేపట్టిన వ్యక్తులను ఐఆర్‌పిడబ్ల్యు సంస్థ ఆధ్వర్యాన సన్మానించారు. రెడ్‌క్రాస్ సొసైటీ చైర్మన్ డాక్టర్ మంచుపల్లి శ్రీరాములు, కమిటీ సభ్యులు కామకృష్ణ, జిల్లేడుముడి అనసూయమ్మను సన్మానించారు. వీరిని తెంధ్రప్రదేశ్ జీవవైవిధ్య మండలి వారు సహకారంతో వివిధ పండ్లు, ఔషధ మొక్కలు సామాజిక కార్యకర్తలకు అందజేశారు. అనంతరం పేదలకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో ఐఆర్‌పిడబ్ల్యు సంస్థ డైరెక్టర్ ప్రకాష్, లక్ష్మణ, మున్సిపల్ ఉద్యోగి ఆకుల శ్రీనువాస్, జనార్ధన్, నిరాశ్రయుల వసతి గృహంలో సిబ్బందిగా పనిచేస్తున్న గణేష్, జానీ, దయ, వెంకటరమణ పాల్గొన్నారు.

తుపానును ఎదుర్కొనేందుకు సిద్ధం

జెడ్‌పి చైర్మన్ శ్రీనివాసరావు

ప్రజాశక్తి-విజయనగరంటౌన్

భారీ తుపానును ఎదుర్కొనడానికి జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని జిల్లా పరిషత్ ఛైర్‌పర్సన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి అధికారులను ఇప్పటికే అప్రమత్తం చేసి, అన్ని రకాల ముందు జాగ్రత్త చర్యలను తీసుకున్నారని ఆయన వెల్లడించారు. జెడ్‌పి సమావేశ మందిరంలో మంగళవారం నిర్వహించిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, సిఎం నిరంతరం అధికారులతో, ప్రజాప్రతినిధులతో మాట్లాడుతూ, తుఫాను ప్రభావాన్ని పర్యవేక్షిస్తున్నారని చెప్పారు. తీరప్రాంతంలో హెచ్చరికలు జారీ చేయడమే కాకుండా, ఎటువంటి పరిస్థితి తలెత్తినా ఎదుర్కొనేందుకు ఎన్‌డిఆర్ఎఫ్, ఎస్‌డిఆర్ఎఫ్ దళాలను సిద్ధంగా ఉంచారని తెలిపారు.

వాతావరణ శాఖ సూచనలను బట్టి మిచౌంగ్ తుపాను ప్రభావం మన జిల్లాపై పెద్దగా లేదన్నారు. అయితే కోతకొచ్చిన వరిపంట నష్టపోయే అవకాశం ఉన్నందున రైతులు తగిన జాగ్రత్తలను తీసుకోవాలని కోరారు. తడిచిపోయిన ధాన్యాన్ని కూడా ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని, రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. ధాన్యాన్ని ఆఫ్‌లైన్లో అయినా కొనుగోలు చేయాలని ఇప్పటికే ప్రభుత్వం ఆదేశాలను జారీ చేసిందని తెలిపారు. రైతు భరోసా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు జరుగుతోందని, రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. ఒక పత్రికలో తనను ఉద్దేశిస్తూ పరోక్షంగా రాసిన వార్త తప్పుడు కథనమని, దురుద్దేశంతో కుట్ర పూరితంగా దానిని ప్రచురించారని పేర్కొన్నారు. సమావేశంలో మాజీ ఎమ్మెల్సీ గాదె శ్రీనువాసుల నాయుడు, అంబళ్ళ శ్రీరాముల నాయుడు పాల్గొన్నారు.

నూతన చట్టంతో తంటాలు

శృంగవరపుకోట : రాష్ట్ర ప్రభుత్వం తెచ్చిన నూతన భూహక్కు చట్టాన్ని (ఏపీ ల్యాండ్ టైటిలింగ్ యాక్టు-2022) తక్షణం ఉపసంహరించుకోవాలని ఎస్.కోట బార్ అసోసియేషన్ న్యాయవాదులు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం తీసుకొస్తున్న టైటిలింగ్ యాక్టును నిరసిస్తూ మంగళవారం కోర్టు విధులను బహిష్కరించారు. ఈ సందర్భంగా అధ్యక్ష కార్యదర్శులు అల్లు సత్యాజీ, డబ్ల్యుఎస్.శర్మ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నూతనంగా తీసుకొచ్చిన ల్యాండ్ టైటిలింగ్ యాక్ట్ వల్ల ప్రజలకు ఎటువంటి ఉపయోగం ఉండదన్నారు. సామాన్యులకు అన్యాయం జరిగేందుకు ఆస్కారం ఉందన్నారు. సహజ న్యాయ సూత్రాలకు విరుద్ధంగా తీసుకొచ్చిన ఈ చట్టంలో స్థానిక సివిల్ కోర్టులకు విచారణ పరిధి (జ్యూరిడిక్షన్) లేకుండా చేశారన్నారు. కేవలం టైటిలింగ్ అధికారులకే అధికారం కట్టబెట్టారన్నారు. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో పనిచేసే ల్యాండ్ టైటిలింగ్ అధికారులపై రాజకీయ జోక్యం ఉండే అవకాశం ఉండవచ్చని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వం చెబుతున్నట్లు సులభంగా వేగంగా కేసులు పరిష్కారం చేయాలని భావిస్తే కోర్టులను పెంచి, సిబ్బందిని నియమించాలని డిమాండ్ చేశారు. సివిల్ కోర్టులు చేయాల్సిన పనిని ల్యాండ్ టైటిలింగ్ అధికారులకు అప్పజెప్పడం ద్వారా పేదలకు మేలు కన్నా నష్టమే ఎక్కువ జరిగే అవకాశం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. బుధవారం కూడా కోర్టు విధులు బహిష్కరించి నిరసన తెలుపుతామన్నారు. ఈ కార్యక్రమంలో సీనియర్ న్యాయవాదులు జి.సూరిదేముడు, గేదెల ప్రకాష్, బి.త్రిమూర్తులు, జి.చిట్టిబాబు, బి.సత్యనారాయణ, ఆర్.సత్యనారాయణ, బి.వెంకటరావు, బొబ్బిలి రామకృష్ణ, పిడిది రామకృష్ణ, బోని శివశేఖర్ బాబు పాల్గొన్నారు.

రైతులకు కెవికె శాస్త్రవేత్తల సూచనలు

ప్రజాశక్తి - కురుపాం

తుపాను కారణంగా కురుస్తున్న భారీవర్షాల నేపథ్యంలో మండలంలో రస్తాకుంటు బాయి కృషి విజ్ఞాన కేంద్ర ప్రోగ్రామ్ కో ఆర్డినేటర్ డాక్టర్ టిఎస్ఎస్‌కె పాత్ర, వాతావరణ విభాగ శాస్త్రవేత్త కె.ప్రశాంత్ రైతాంగానికి వాతావరణ ఆధారిత వ్యవసాయ సూచనలను మంగళవారం తెలిపారు. చిరుధాన్యాలు పంటల్లో వర్షపు నీరు లేక మురుగు నీరు నిలిచి ఉన్నట్లయితే వీలైనంత తొందరగా నిల్వ ఉన్న నీటిని పొలం నుంచి బయటకు తీసి ఏర్పాటు చేయాలని పంటను కోసి పొలంపై ఉంచినప్పుడు ఎకరాకు 2 శాతం ఉప్పు ద్రావణాన్ని 20 (గ్రాములు / లీటరు) వంతున కలుపుకొని తీసిన పంట కంకులపై వెదజల్లడం ద్వారా బూజు, కంకిపై గింజలు మొలక రాకుండా నివారించుకోడానికి అవకాశం ఉంది. అలాగే పంట పొలంపైన వాలిపోయినప్పుడు పైకి జరిపి గుంపుగా నిలబెట్టుకొని కాపాడుకోవాలన్నారు.

ఇతర పంటలకు సూచనలు

అలాగే కంది, పెసర, మినుము పంటలు పొలంలో నిల్వ ఉంటే నీటిని కాలువల ద్వారా బయటకి పంపించి వర్షాలు ఆగిన వారం తర్వాత 1 శాతం 19:19:19 లేదా కెఎన్ఒ ను పొలంలో పిచికారీ చేసుకోవాలని సూచించారు. అపరాల్లో వేరుకుళ్లు తెగులు తట్టుకునేందుకు గానూ పొలంలో హెక్సాకొనజోల్ 2 మిల్లీలీటర్లు లేదా (ప్రొపికొనజోల్ 1 మిల్లీ లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలన్నారు. అలాగే కంది పంట కాయదశలో ఉండడం వల్ల కామతొలుచు పురుగు నివారణకు ఫ్లోరిపైరిఫాస్ 2.5 మిల్లీలీటరు నీటిలో కలిపి వర్షాలు ఆగిన వారం రోజుల తర్వాత పిచికారీ చేసుకోవాలని సూచించారు.

ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన

ప్రజాశక్తి -పార్వతీపురంరూరల్

మండలంలోని గంగాపురం ఆర్‌బికెలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మంగళవారం జాయింట్ కలెక్టర్ ఆర్.గోవిందరావు, తహశీల్దార్ శివన్నారాయణతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికారులతో మాట్లాడుతూ తుపాను వాతావరణం దృష్టిలో ఉంచుకొని రైతుల దగ్గర నుంచి ఆఫ్‌లైన్‌లో తీసుకున్న ధాన్యానికి పేమెంటుకు సంబంధించిన ఇబ్బందులు రాకుండా వాటి వివరాలు ఆన్ లైన్ నందు నమోదు చేయాలని, ఇ-క్రాప్ బుకింగు చేసిన పంటను మాత్రమే కొనుగోలు చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లయి జిల్లా మేనేజరు దేవుళ్ల నాయక్, వ్యవసాయ అధికారి అశోక్ పాల్గొన్నారు.



క్రీడాకారులకు సూచలను ఇస్తున్న పంచాయతీ కార్యదర్శి పాపారావు

ప్రతిభను వెలికి తీసే వేదిక ఆడుదాం ఆంధ్ర

ప్రజాశక్తి - సీతంపేట

మండలంలోని కుడ్డపల్లిలో ఆడుదాం ఆంధ్ర పోస్టర్ను కార్యదర్శి వై.పాపారావు, సర్పంచులు నరసమ్మ, ప్రతినిధి బాపయ్య ఆవిష్కరించారు. ఈ సందర్భంగా క్రీడాకారులను గుర్తించి అవగాహన కల్పించి రిజిస్ట్రేషన్ చేశారు. దీనిపైకార్యదర్శి పాపారావు అవగాహన కల్పించారు. ఫిబ్రవరి 3 వరకు ఆడుదాం ఆంధ్ర కార్యక్రమాలు జరుగుతాయని తెలిపారు. యువతలో దాగి ఉన్న ప్రతిభ వెలికి తీయడానికి ఆడదాం ఆంధ్ర కార్యక్రమం ఒక వేదిక అవుతుందని, దీనిని క్రీడాకారులు వినియోగించుకోవాలని కోరారు. గ్రామస్థాయి నుంచి జాతీయ స్థాయికి ఎదగడానికి ఇది ఒక గొప్ప అవకాశం అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ప్రతినిధి మోహన్‌రావు, గ్రామస్తులు ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

గొయిదిలో ఆడదాం ఆంధ్ర బ్యానర్ డిస్‌ప్లే

మండలంలోని గొయిది సచివాలయంలో ఆడుదాం ఆంధ్రా బ్యానర్ డిస్ప్లే కార్యక్రమం మంగళవారం ఎంపిడిఒ కె.గీతాంజలి నిర్వహించారు. గ్రామ వాలంటీర్లు మొబైల్ ఫోన్లో రిజిస్టర్ చేసే అవకాశం ఉందన్నారు. దీన్ని వినియోగించుకోవాలని క్రీడాకారులను కోరారు. అనంతరం తురాయిపువలస సమీపాన గొయిది గెడ్డ నీరు తుపాన్ సందర్భంగా రోడ్డుపైకి రాకుండా జెసిబి ద్వారా ఎంపిడిఒ గీతాంజలి, తహశీల్దార్ నర్సింహమూర్తి, జంగ్లింగ్ క్లీనింగ్ చేశారు.

నదిలో వృద్ధురాలి మృతదేహం లభ్యం

ప్రజాశక్తి - మక్కువ



మండలంలోని డి-శిర్లాం పంచాయతీ పరిధిలో గోముఖి- సువర్ణముఖి నదుల సంగమం సమీపంలోని మంగళవారం స్థానికులు ఓ వృద్ధురాలి మృతదేహాన్ని గుర్తించారు. అనంతరం పోలీసులకు సమాచారం అందించారు. డి.శిర్లాం పంచాయతీ పరిధిలోని లావరకండికి చెందిన ఒప్పంగి పారమ్మ (74) గా గుర్తించారు. పోస్టుమార్టం నిమిత్తం సాలూరు సిహెచ్‌సికి మృతదేహాన్ని తరలించారు. ఇదిలా ఉండగా పారమ్మకు మతిస్థిమితం లేకపోవడంతో ఎక్కడికి వెళుతుందో తెలియని పరిస్థితి ఉందని స్థానికులు తెలిపారు. మంగళవారం నదిలో శవమైతెలడంతో పలువురు దిగ్భ్రాంతి వ్యక్తం చేస్తున్నారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



రైళ్ల రాకపోకలు నిలిచిపోవడంతో బోసిపోయిన విజయనగరం రైల్వే స్టేషన్

తుపాను ప్రభావంతో పలు రైళ్లు రద్దు

ప్రజాశక్తి-విజయనగరం కోట

బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావం వల్ల విజయనగరం మీదుగా వెళ్తున్న పలు రైళ్లను రైల్వేశాఖ రద్దు చేసింది. ఈ నేపథ్యంలో మంగళవారం విజయనగరం, పార్వతీపురం, బొబ్బిలి రైల్వేస్టేషన్లు బోసిపోయాయి. మిచౌంగ్ తుపాను ప్రభావం ఉత్తర కోస్తా జిల్లాలపై కూడా ఉండడంతో విజయనగరం రైల్వే స్టేషన్ మీదుగా నడిచే రైళ్లను రద్దు చేశారు. వీటిలో 15228 ముజాఫర్ పూర్ - బెంగళూరు, 12516 గౌహతి - బెంగళూరు, 22504 డబ్రూకర్ - కన్యాకుమారి, 12839 షాలిమార్ - చెన్నై సెంట్రల్ మెయిల్ ఎక్స్‌ప్రెస్, 12863 హౌరా - బెంగళూరు యశ్వంతపూర్, 13357 రాంచి - కేరళ, 17244 రాయగడ - గుంటూరు పాసింజర్, 12840 చెన్నై - షాలిమార్ , 22856 తిరుపతి - ఛత్రగచ్చి, 17243 గుంటూరు - రాయగడ , 18511 కోరాపుట్ - విశాఖపట్నం, 12846 బెంగళూరు - భువనేశ్వర్ స్పెషల్ ట్రైన్‌లు ఉన్నాయి. ముందుగానే తుపాను హెచ్చరికలు రావడంతో ప్రయాణికులంతా తమ ప్రయాణికులను రద్దు చేసుకున్నారు.ఈ నేపథ్యంలో విజయనగరం రైల్వేస్టేషన్ ప్రయాణికులు లేక బోసిపోయింది.

వాలంటీర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్

ప్రజాశక్తి- బొబ్బిలి

మున్సిపాలిటీలోని 16వ సచివాలయం పరిధిలో ఖాళీగా ఉన్న ఐదు వార్డు వాలంటీర్ పోస్టులు భర్తీకి జిల్లా కలెక్టర్ నోటిఫికేషన్ జారీ చేసినట్లు మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 7 నుంచి 13 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తులు చేసుకోవచ్చునని చెప్పారు. ఆసక్తి వున్నవారు దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఈనెల 14న మున్సిపల్ కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తామన్నారు.